# కోలుకుంటున్న కేసీఆర్

## పరామర్శించిన ప్రముఖులు

సోమాజిగూడలోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోలుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, సినీ ప్రముఖులు గురువారం కేసీఆర్‌ను కలిసి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజలకు సేవ చేయాలని కోరారు.



బీఆర్ఎస్ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్







మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్దన్ రెడ్డి, గణేశ్ గుప్తా



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



ఎమ్మెల్సీ నవీన్‌రావు, బీఆర్ఎస్ నేత



సినీ నటుడు సీనియర్ నరేశ్










వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు బాలమల్లు, బాలరాజు యాదవ్, ఆంజనేయ గౌడ్, కె.రవీందర్ రావు, పల్లె రవికుమార్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, దామోదర్ గుప్తా, సతీశ్ రెడ్డి

## హెచ్‌పీఎస్‌లో 25, 26న స్టార్టప్ సమ్మిట్

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల స్టార్టప్ 'స్టార్ ఎక్స్' పేరుతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌ను ఈనెల 25, 26 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవెంట్‌లో పాల్గొనే వారి వివరాలను షార్ట్‌లిస్ట్‌లో ఈనెల 17న వెల్లడించనున్నారు. రూ.25కోట్ల కంటే తక్కువ ఆదాయం గల స్టార్టప్‌లకు ఊతం ఇవ్వనున్నారు. అంతరిక్ష అన్వేషణ, రక్షణ సాంకేతికత, అగ్రిటెక్‌లలో పురోగతిని సాధించేందుకు కృషిచేయనున్నట్లు వెల్లడించారు. 'ఇండియా టుమారో' 'ది ఫ్యూచర్ ఇన్ ఫోకస్', అంతరిక్ష పరిశోధన, రక్షణ, సాంకేతికతలపై విశ్లేషణలు నిర్వహించనున్నారు. నూతన పారిశ్రామికవేత్తల సాధికారతే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈవెంట్‌లో 30 స్టార్టప్‌లను ప్రదర్శించనున్నది. 300మందికి పైగా వ్యవస్థాపకులు పాల్గొననున్నారు. ఇందులో హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులు పలువురు పాల్గొననున్నట్లు తెలిపారు. హెచ్‌పీఎస్ ప్రెసిడెంట్ గుస్తి నోరియా మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో వ్యవస్థాపకత, ఆవిష్కరణ రంగంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

## హెచ్‌ఐవీకి మెరుగైన ఔషధాలు



జూబ్లీహిల్స్, డిసెంబర్ 14 : హెచ్‌ఐవీ నిర్వహణలో ఆధునిక చికిత్స మంచి ఫలితాలను ఇస్తున్నదని ఇన్ఫెక్షియస్ డిసీజ్ స్పెషలిస్టులు డాక్టర్ వెంకట్ రమేశ్, డాక్టర్ విష్ణురావు పేర్కొన్నారు. హెచ్‌ఐవీ నిర్వహణలో కొత్త తరగతి ఔషధమైన ఐఎన్ఎస్‌టీలు మెరుగైన పురోగతిని సాధించాయని వెల్లడించారు. హైచ్‌ఐవీ వైరస్ స్థాయిలో గణనీయమైన తగ్గింపును సాధించిన ఔషధాల వివరాలపై నివేదికను గురువారం వెల్లడించారు. ఐఎన్ఎస్‌టీఐ ఔషధంతో పాటు డోలుటెగ్రావిర్ వైరస్‌ను అణిచివేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయన్నారు.ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవీ రోగుల జాబితాలో భారతదేశం 3వ స్థానంలో నిలిచిందన్నారు. హెచ్‌ఐవీని గుర్తించడం.. సత్వర చికిత్స అందించడం నేటికీ వైద్య వర్గాలకు సవాలుగా మారుతున్న తరుణంలో అధునాతన ఔషధాలు సత్ఫలితాలనిస్తున్నాయని వెల్లడించారు.

## జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలి

***బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు మిద్దె సురేశ్***



సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రానున్న స్థానిక సంస్థలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు, యువకవి మిద్దె సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలో నిర్వహించిన బీసీ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది గ్రామ పంచాయతీలతో పాటు స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ కాలపరిమితి ముగియనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



కాచిగూడ, డిసెంబర్ 14: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ వద్ద నిర్వహించిన ధర్నాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, బడుగుల లింగయ్య, మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు హాజరయ్యారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, బీసీలంటే వాటాదారులన్నారు. దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు ప్రధాని నరేంద్ర మోదీ వ్యతిరేకమా.. అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న దాదాపు 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, నీల వెంకటేశ్, మరేశ్, మహేందర్, వేణుమాదవ్, భూపేశ్‌సాగర్, నందగోపాల్, రామకృష్ణ, పృథ్వీగౌడ్, డాక్టర్ పద్మలత, ఉదయ్, రవీందర్ తదితరులున్నారు.

## ఎస్‌సీఆర్‌కు అవార్డులు

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న రైల్వే సిబ్బందికి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రదానం చేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు ప్రదానం చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అవార్డులు అందుకున్న సిబ్బందిని ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. అయితే సిబ్బంది తరుపున ఎస్‌సీఆర్ జీఎం పలు అవార్డులు అందుకున్నారు.

## శిల్పారామంలో నేటి నుంచి ఆలిండియా క్రాఫ్ట్స్ మేళా



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కొండాపూర్, డిసెంబర్ 14 : చేనేత హస్తకళాకారులకు చేయూతనిచ్చేందుకు మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 15వ తేదీ నుంచి ఆలిండియా క్రాఫ్ట్స్ మేళా ప్రారంభం కానున్నట్లు శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య గురువారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చేనేత, హస్తకళాకారులకు చేయూతనందించేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించే క్రాఫ్ట్స్ మేళాను ఈ ఏడాది యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15 నుంచి 31వ తేదీ వరకు మేళా కొనసాగుతుందని, నగరవాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మేళాలో సందర్శకులకు ప్రత్యేక ఆహ్లాదాన్ని పంచేందుకు ప్రతి రోజు సాయంత్రం కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.